ఫలితాలు విడుదల చేయాలి

- నిరుద్యోగ ఆయుష్ డాక్టర్ల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ ఆఫీసర్ల (ఆయుష్) ఫలితాలను విడుదల చేయాలని నిరుద్యోగ ఆయుష్ డాక్టర్ల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని ఆయుష్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆ వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయుష్ కమిషనర్ ప్రశాంతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ ఆయుష్ డాక్టర్లు మాట్లాడుతూ ఆయుష్ వైద్యుల నియామకానికి గత ప్రభుత్వం 2022 జులై 5న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వాటి ఆధారంగా 2023 జులై 7న వైద్యారోగ్య నియామక మండలి నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. సెప్టెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత వైద్యారోగ్య నియామక మండలి అధికారులను సంప్రదించినా సరైన స్పందన రాకపోవడంతో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నాలుగైదు సార్లు కలిసి విన్నవించినట్టు చెప్పారు. దీంతో మంత్రి స్వయంగా మండలి అధికారులకు ఫోన్ చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారని గుర్తుచేశారు.అయినా ఆ ప్రక్రియ ముందుకు పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలలుగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్నామనీ, వాటి విడుదలకు చొరవ చూపించాలని వారు కోరారు.

కలిసికట్టుగా కరువును ఎదుర్కొందాం

- 'రైతు నేస్తం' ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంత కష్టం వచ్చినా..కరువు వచ్చినా రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నాయని, కలిసికట్టుగా కరువును ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఏడాదిగా సరైన వర్షపాతం లేకపోవడంతో రిజర్వాయర్లలో నీళ్ల అడుగంటుతున్నాయని, అందుకే అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రిజర్వాయర్ల నుంచి నీళ్లను విడుదల చేయాలని కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ ప్రాంతంలోని రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. రైతులందరూ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎండాకాలంలో తాగునీటి కష్టాలు రాకుండా చూడాల్సిన అవసరముందని, అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న సిఎం, పాల్గొన్న నేతలు

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి పలువురు రైతులు కాన్ఫరెన్స్‌లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. తాము పండిస్తున్న పంటల ద్వారా లాభాలు సాధిస్తున్న తీరును వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2601 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్‌ను అనుసంధానం చేసి నేరుగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వినూత్నంగా ఈ కార్యక్రమం చేపట్టింది. తొలి విడతగా ప్రయోగాత్మకంగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను నెలకొల్పింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ రూ.97 కోట్లతో ఈ కార్యక్రమం చేపట్టింది. దీంతో రాష్ట్ర అధికారులతో పాటు వ్యవసాయ నిపుణులు నేరుగా గ్రామాల్లో, పంట పొలాల్లో ఉండే రైతులతో ముఖాముఖి మాట్లాడి వాళ్ల సమస్యలను తెలుసుకుంటారు. పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలతో పాటు అధునాతన మెలకువలను ఎప్పటికప్పుడు వారికి అందిస్తారు.

రైతులతో సిఎం మాట్లాడుతూ.. ప్రతి సీజన్‌లో రైతులు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఎప్పటికప్పుడు వాళ్లకు సలహాలు, సూచనలిచ్చేందుకు రైతు నేస్తం ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. నేరుగా రైతులు వ్యవసాయ నిపుణులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రభుత్వమే ప్రజల దగ్గరికి వెళ్లాలని, అందులో భాగంగానే రైతుల సమస్యలను తెలుసుకోవాలనే ఆలోచనతో వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. రైతులతో కలిసి మెలిసి భవిష్యత్ కార్యక్రమాలను తమ ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. విత్తనాలు, ఎరువులు, ఏ పంట వేయాలనేది మొదలు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేంత వరకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కాకుండా లాభసాటి ధర రావాలనే ఆలోచనతో ప్రభుత్వం కార్యాచరణ చేస్తోందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతులకు విత్తనాలు అందుబాటులోకి తీసుకురావటం, ఐకెపి సెంటర్లు, మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలు కార్యక్రమాలన్నీ చేపడుతుందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 26 రకాల పంటలు పండటానికి అనుకూలమైన భూములు, వాతావరణం ఉందని, కేవలం వరి లేదా పత్తి, మిర్చి పంటలకే పరిమితం కావద్దని రైతులకు సిఎం సూచించారు. ఇతర పంటలు సాగు చేయాలని, పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. తక్కువ నీళ్లతో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి, ఎక్కువ లాభాలు వచ్చేలా పంటలను ప్రణాళిక చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాఖ చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 110 సెంటర్లలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో అన్ని గ్రామాలకు విస్తరిస్తామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సూచనలతో ప్రభుత్వం ఇటీవలే పంటల భీమా పథకాన్ని అమల్లోకి తెచ్చిందని గుర్తు చేశారు. రైతులు ఏదైనా ఆపదలో చనిపోతే ఆ కుటుంబాన్ని రైతు బీమా పథకం ద్వారా ఆదుకుంటామని చెప్పారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులు ధైర్యం కోల్పోవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో బిఆర్ఎస్‌కు షాక్

- హస్తం గూటికి కోనప్ప!
- సిఎం రేవంత్‌తో భేటీ
- అదే బాటలో ఓ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ పరిణామాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇన్నాళ్లు బిఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న నాయకులు తాజాగా పార్టీని వీడేందుకు సిద్ధం కావడం చర్చనీయాంశమవుతోంది. సిర్పూర్ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప పార్టీని వీడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. బుధవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. త్వరలోనే హస్తం కండువా కప్పుకొంటారని, ఇందుకు తేదీ ఖరారు చేస్తారని తెలిసింది.

సిఎం రేవంత్‌ను కలిసిన కోనేరు కోనప్ప

బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌ను కలవడం.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయాలని ఒక నిర్ణయానికి వచ్చిన విషయం తెలిసిందే. సిర్పూర్‌లో తన ఓటమికి కారణమైన ఆర్ఎస్‌పితో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ భేటీ కావడం, పొత్తు పెట్టుకుంటామని చెప్పడం నచ్చకనే కోనప్ప పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఆయనతోపాటు పలువురు కీలక నాయకులు సైతం గులాబీ పార్టీని వీడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. త్వరలోనే కాంగ్రెస్‌లో చేరే తేదీని ఖరారు చేస్తారని తెలిసింది. మరోపక్క అదే బాటలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రితోపాటు మాజీ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమైనట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన పెద్దపల్లి ఎంపి వెంకటేష్ నేత, ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిపోగా.. ఆదిలాబాద్ జడ్‌పి చైర్మన్ రాథోడ్ జనార్దన్ బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నాటికి ఉమ్మడి జిల్లా బిఆర్ఎస్‌కు చెందిన మరికొందరు కీలక నాయకులు సైతం హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఏమి నిర్ణయం తీసుకుంటారనేది ఆ పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది.

గ్రూప్స్ రాతపరీక్షల తేదీలు ఖరారు

- ఆగస్టు 7,8న గ్రూప్-2
- అక్టోబర్ 21న గ్రూప్-1 మెయిన్స్
- నవంబర్ 17,18న గ్రూప్-3
- టిఎస్‌పిఎస్‌సి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 రాతపరీక్షల తేదీలు ఖరారయ్యాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు ఏడు, ఎనిమిది తేదీల్లో గ్రూప్-2, అక్టోబర్ 21న గ్రూప్-1 మెయిన్స్, నవంబర్ 17,18 తేదీల్లో గ్రూప్-3 రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతనెల 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టిఎస్‌పిఎస్‌సి జారీ చేసిన విషయం తెలిసిందే. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2022, ఏప్రిల్ 26న ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు ఈనెల 14వ తేదీ వరకు తుది గడువున్నది. పాత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిందేనని, అయితే ఫీజు మాత్రం మినహాయింపునిస్తున్నట్టు టిఎస్‌పిఎస్‌సి స్పష్టం చేసింది. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించనుంది. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టిఎస్‌పిఎస్‌సి విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గ్రూప్-2 రాతపరీక్షలు పలుమార్లు వాయిదా పడ్డాయి. 1,388 గ్రూప్-3 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 30న టిఎస్‌పిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

కెసిఆర్‌పై సమగ్ర విచారణ జరపాలి

- టిపిసిసి అధికార ప్రతినిధి సుధాకర్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఐదారు నెలల తర్వాత కాంగ్రెస్ సర్కారు ఉండదని బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచనలు చేస్తున్న కెసిఆర్‌పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీనియర్ నేత తుమ్మేటి సమ్మిరెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే బిఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారన్న సంగతి తెలుసుకుని వారు పార్టీ నుంచి వెళ్లిపోతారనే భయంతోనే, నిస్సహాయ పరిస్థితుల్లోనే కేసీఆర్ పైపైకి బీరాలు పలుకుతున్నాడని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తి మెజార్టీతో ఏర్పాటై, ప్రజారంజకంగా పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కెసిఆర్ ఎలా పడగొడతారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు ఉన్న సంఖ్యాబలం, ప్రజాబలం చూస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరని గుర్తు చేశారు. కేసీఆర్ ఇంకా తానే సీఎం అనే భ్రమల్లో ఉన్నారని, తమ కుటుంబం అక్రమంగా సంపాదించిన డబ్బుతో కేసీఆర్ ఓ సినిమా తీసి, అందులోనైతే తానే సీఎం పాత్రలో నటించవచ్చు కదా? అని ఎద్దేవా చేశారు.

పాడి రైతుల బిల్లులు చెల్లించండి

- టి సాగర్, నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్
- విజయ డెయిరీ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాడి రైతులకు విజయ డెయిరీ పెండింగ్ పెట్టిన బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని, లీటర్‌కు రూ.5 ఇన్సెంటివ్ ఇవ్వాలని, సబ్సిడీపై దాణా సరఫరా చేయాలని కోరారు. సబ్సిడీపై పశువులను సరఫరా చేయాలని, రైతులకు, పశువులకు బీమా సౌకర్యం కల్పించాలని, విద్యుత్ అధికారులు ఫైన్‌లు వేయడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రైతు సంఘం, విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ లాలాపేటలోని విజయ డెయిరీ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టి సాగర్, నంద్యాల నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పాడి రైతులకు ప్రతి 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టిఐపి కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యలో వివిధ జిల్లాల్లో విద్యుత్ అధికారులు డెయిరీ ఫామ్‌ల యజమానులపై జరిమానాలు వేస్తున్నారని, బావుల వద్ద పశువులను పెంచుకుంటే.. బావిలోని నీళు పశువులు తాగినా ఫైన్ వేస్తామనడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పాడిరైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు, ప్రభుత్వానికి డెయిరీ ఎండి లెటర్ రాయాలని కోరారు. లీటర్ పాలకు రూ.నాలుగు ఇన్సెంటివ్ మూడు సంవత్సరాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కొత్త ప్రభుత్వం ఎన్నికల ముందు పాడి రైతులకు లీటర్‌కు రూ.ఐదు ఇన్సెంటివ్ ఇస్తానని హామీనిచ్చిందని.. దాన్ని వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. పాడి పశువులకు ఇన్సూరెన్స్ పథకం ప్రవేశపెట్టాలని, పాడిరైతులకు గడ్డి కటర్ మిషన్, పాలు పిండే మిషన్, దాణా 50 శాతం సబ్సిడీతో సరఫరా చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ పరిరక్షణ సమితి నాయకులు సాదం రమేష్, ఉప్పలయ్య, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దర్శి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రావుల జంగయ్య, రాష్ట్ర నాయకులు టి కిషోర్, రాష్ట్ర కో కన్వీనర్ విరమల్ల రాజయ్య, సునీల్, కోటగిరి నాగేశ్వరరావు, పెంట రమేష్, రాజేష్, జిల్లాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం : డెయిరీ ఎండి

పాడి రైతుల ఆందోళనతో విజయ డెయిరీ ఎండి చిట్టెం లక్ష్మి వారితో చర్చలు జరిపారు. నాలుగు రోజుల్లో ఒక బిల్లు చెల్లిస్తామని, రెండు బిల్లులు 15 రోజుల్లో చెల్లిస్తామని ఎండి హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు.

డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ ఇంటి జాగా

- హెచ్‌యుజె - టిడబ్ల్యుజెఎఫ్ డైరీ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ ఇల్లు లేదా ఇంటి స్థలం ఇస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం వస్తుందని, ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన చెప్పారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె - టిడబ్ల్యూజేఎఫ్)2024 డైరీని బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో సంఘం నేతలతో కలిసి మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌యుజె కార్యవర్గానికి, సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు జర్నలిస్టులు సహకారం అందించాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను హెచ్‌యుజె నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టు సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రాధాన్యత అంశంగా ఉందని మంత్రి చెప్పారు. జర్నలిస్టుల సీనియార్టీని బట్టి వారిని కేటగిరిలు ఏర్పాటు చేసి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం దృష్టిలో అన్ని జర్నలిస్టు సంఘాలు సమానమేననీ, జర్నలిస్టులందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌యుజె అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్ కుమార్, బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ బి. రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, హెచ్‌యుజె నాయకులు బి.దామోదర్, నాగవాణి, రమేష్, వీరేష్, విజయ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని ఇబ్బందులైనా నిజాం షుగర్స్‌ని పున:రుద్ధరిస్తాం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ముత్యంపేట ఫ్యాక్టరీని సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- చెరుకు రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రధానాంశంగా పేర్కొన్న నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణను ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చేపడుతాం. ఈ ఫ్యాక్టరీని విలువ ఆధారిత పరిశ్రమగా తీర్చిదిద్దుతాం. గత బిఆర్ఎస్ పాలకులు చెరుకు రైతులను నిర్లక్ష్యం చేసి వారిని నష్టాలపాలు చేశారు' అని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సహా జిల్లా కలెక్టర్, అధికార బృందంతో కలిసి మంత్రి బుధవారం జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరించే వరకూ గడ్డం తీయకుండా, చెప్పులు ధరించకుండా తొమ్మిది నెలలుగా దీక్ష చేపట్టిన చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డిని కలిశారు.

చెరుకు రైతులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం మల్లాపూర్‌లో చెరుకు రైతులతో ముఖాముఖి, జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచన మేరకు ఇక్కడి ప్రజల కష్టాలను అర్థం చేసుకుని ఈ ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశాన్ని మానిఫెస్టోలో చేర్చామని తెలిపారు. ఫ్యాక్టరీని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఒక కమిటీని వేసిందని, చెరుకు రైతులు, అధికారులతో చర్చించామని తెలిపారు. సమస్యను అధిగమించేందుకు నిజాం షుగర్ ఫ్యాక్టరీని నడిపిన యాజమాన్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారని వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చెరుకు రైతులను, అధికారులను లెక్క చేయకుండా నష్టపర్చిందని విమర్శించారు. ఆ ప్రభుత్వ నిర్వాకం వల్లే రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సింగరావు, ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బిజెపిని ఓడించడమే లక్ష్యం

- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఠాగూర్
- పార్టీ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా, పిసిసి సిపిఐ (ఎంఎల్), సిపిఐ (ఎంఎల్) ఆర్ఐ.. విప్లవ పార్టీలు రాజకీయ సైద్ధాంతిక చర్చల తరువాత సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ పేరుతో ఒకే వేదిక మీదకు వచ్చాయని తెలిపారు. సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ మహాసభ ఖమ్మంలో మూడ్రోజులు (3,4,5 తేదీల్లో) జరిగాయన్నారు. అఖిల భారత శ్రామికవర్గ కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు కృషి చేస్తామని, ఐక్యంగా పోరాడాలని తీర్మానించినట్టు చెప్పారు. తక్షణ కర్తవ్యంగా అన్ని ఫాసిస్టు వ్యతిరేక శక్తులతో ఏకమై 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్ట్ బిజెపి-ఆర్ఎస్ఎస్‌ను ఓడించాలని స్పష్టంచేశారు. మహాసభలో ప్రతినిధులు కూలంకుషంగా చర్చించిన తర్వాత కొత్త ప్రజాస్వామ్య విప్లవం, పార్టీ రాజ్యాంగం, రాజకీయ తీర్మానం అనే మూడు పత్రాలను సమావేశం ఆమోదించిందని తెలిపారు. జియోనిస్ట్ ఇజ్రాయెల్ రాజ్యం ద్వారా జరిగిన మారణహోమం దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలతో కలిసి నిలబడాలని తీర్మానం చేసినట్టు చెప్పారు. మణిపూర్‌లో మెయిటీకి వ్యతిరేకంగా బిజెపి-ఆర్ఎస్ఎస్ హింసను ఈ సందర్భంగా ఖండించారు. జిఎన్ సాయిబాబా, ఇతరులపై కేసులను ముంబై కోర్టు కొట్టివేసిందని, అతన్ని చాలా ఏండ్లుగా నిర్బంధించినందుకు భారత ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతీయ సమాజంలోని శ్రామిక, కర్షకులు, అణగారిన వర్గాల ప్రజలందరి పోరాటాలకు అండగా నిలవాలని నిర్ణయించినట్టు తెలిపారు. యుఎపిఎ, ఎఎఫ్ఎస్పిఎ వంటి అన్ని క్రూరమైన చట్టాలను వ్యతిరేకించాలని కోరారు. కొత్త పార్టీ అయిన సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్.. కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, అస్సాం, త్రిపుర, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో కార్యవర్గాలను కలిగి ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఠాగూర్

నూతన కమిటీ ఎన్నిక

తొమ్మిది మంది సభ్యుల పొలిట్ బ్యూరో, 21 మందితో సెంట్రల్ కమిటీ, ముగ్గురు సభ్యులతో కంట్రోల్ కమీషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్ సింగ్ ఠాకూర్ (పశ్చిమ బెంగాల్), సంయుక్త కార్యదర్శులుగా సుభాష్ దేబ్ (త్రిపుర), పోటు రంగారావు (తెలంగాణ), కంట్రోల్ కమిషన్ చైర్మెన్‌గా రాయల చంద్రశేఖర్ ఎన్నికయ్యారని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జాతీయ నాయకులు పోటు రంగారావు, సుభాష్ దేవ్, కెజి రాంచందర్, కె రమ, అలెక్ చక్రవర్తి, దేవవ్రత శర్మ, దినేష్ గోహైన్, సంజయ్ సింఘ్వి, కెచ్చేలా రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరావు, కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- ఈ ఏడాది 4.50 లక్షల గృహాల నిర్మాణం
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం
- మంత్రి పొంగులేటి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇళ్లు లేని పేదవారి కోసం రాష్ట్రంలో ఈ ఏడాది 4.50 లక్షల ఇళ్లను నిర్మించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్టు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి చర్చించారు. హామీలు ఇవ్వడమే కాదు ఇచ్చిన ప్రతి హామీని ఆచరణలో అమలు చేయడమే ఇందిరమ్మ రాజ్యమన్నారు. 'పేదవారికి సొంత ఇల్లు ఒక కల... అది నెరవేరితే పేదవాడి ఇంట పండుగే' అని అన్నారు. నిరుపేదలకు నిలువ నీడను కల్పించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమని వ్యాఖ్యానించారు. తొమ్మిదిన్నరేండ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన గత పాలకులు ఆ కర్తవ్యాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను, ఆశలను గత ప్రభుత్వం వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకుందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అందించేందుకు అవసరమైన కార్యాచరణను ప్రారంభించిందని తెలిపారు. తొలి విడతగా ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ పథకాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. తొలి విడతలో సొంత స్థలం కలిగిన వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయనున్నామని తెలిపారు. మహిళల పేరుపై ఇళ్లను మంజూరు చేస్తామనీ, ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రత కార్డు ఆధారంగా లబ్దిదారులను ఎంపి చేస్తామని వివరించారు. ఇందుకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు.

BEFORE THE CHAIRMAN
MACT-CUM- VIII ADDL.
DISTRICT & SESSIONS JUDGE,
R.R.DISTRICT AT L.B.NAGAR
M.V.O.P. No.337 OF 2023

Between:
Mohsin Ali & others
...Petitioners
AND
M/s Dilshuknagar Educational Society & others
...Respondents

Notice to Respondent no.3

B. Yadi Reddy,
S/o Chandra Reddy, Aged 48Years, Occ: Driver of Vehicle No. TS07UE7990 R/o Plot No.72/8, Sathyanagar, Maruthinagar, Kothapet, Saroornagar, Ranga Reddy. District - 500039
Telangana State.

Please take notice that the above named claim petitioners have filed above claim petition for seeking compensation under M.V.Act for an amount of Rs.20,00,000/- against you and others. The said case is coming up for your appearance and the same is postd to 26-3-2024. So please appear on 26-3-2024 at 10.30 AM before the Hon'ble MACT-cum- VIII Addl. District & Sessions Judge, Ranga Reddy District at L.B.Nagar, either in person or through an advocate failing which the matter will be decided in your absence as per law.

BY ORDER OF THE COURT
P. VENKATESWARLU
Advocate
H.No. 1-5-1005, Old Maruthinagar,
Beside Fruit Market,
Hyderabad-500035.
Mobile No. 9848197791.

IN THE COURT OF THE HON'BLE
V ADDL. DISTRICT JUDGE, R.R. DIST.
AT L.B. NAGAR
I.A. No. 323 OF 2021
IN
I.A. No. 162 OF 2019
IN
O.S. No. 283 OF 2016

BETWEEN:
Namani Shivaram @ Shivaramulu
... Petitioner/Petitioner/Plaintiff
AND
1) Pendem Raghu (died)
... Respondent/Respondent/Defendant
2) Pendem Jayamma & others
... Respondents/Proposed Respondents /Proposed Defendants

To
Pendem Pallavi D/o late Pendem Raghu Aged about 29 years, Occ: Household, R/o H. No.13-35, Pochampally to Bibi Nagar main road, Bhoodan Pochampally village & Mandal, Yadadri-Bhongiri district.
(defendant No.6)

The above named plaintiff has filed a suit for Recovery of Money. And in the said suit the Petitioner/Plaintiff had filed petition to implead the Respondents No.2 to 6 as Defendants No.2 to 6. The notices sent through court are not served on you, as such the Hon'ble Court has pleased to order substitute service through this publication as such you appear before this Hon'ble Court on 12.03.2024 at 10.30 am., either in person or through counsel failing which the matter will be decided in your absence.

// By order of the Court //
P. KIRAN KUMAR
Advocate
401 & 402, Laxmi White House Shopping Complex, Doctors' Colony,
L.B. Nagar, Hyderabad.

ఎండిపోతున్న వరి పంట

- పాలేరు పాత కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి
- ఎండిన పంటలకు ప్రభుత్వమే నష్టపరిహారం అందించాలి
- జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా.. నీరు రావడం లేదు
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు

ఎండిన పొలాలను పరిశీలిస్తున్న పోతినేని సుదర్శన్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలేరు రిజర్వాయర్ పాత కాలువ పరిధిలో నీళ్ల లేక వేల ఎకరాల్లో వరి పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే పాత కాలువకు నీటిని విడుదల చేసి, పొట్ట దశలో ఉన్న పంటలను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు డిమాండ్ చేశారు. ఇప్పటికే నీళ్ళ లేక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మల్లేపల్లి, జక్కేపల్లి, పెరిక సింగారం గ్రామాల్లో పాత కాలువ ద్వారా నీళ్ల అందక ఎండిన పొలాలను, ఎండిన కాలువ, వాగులను రైతు సంఘం నాయకులు, ఆయకట్టు రైతులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెరిక సింగారం గ్రామంలోని ఎండిన పొలాల దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పాలేరు పాత కాలువకు నీళ్ల వస్తాయన్న ఆశతో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో సుమారు పదివేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, ప్రస్తుతం వరి పొలాలు పొట్ట దశలో ఉన్నాయన్నారు. ఆయకట్టు పరిధిలో రైతులు ఒక్కొక్క ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టినా నీరు అందక ఇప్పటికే కొన్ని వేల ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండుతున్న పంటల్లో పశువులను మేపుతున్నారని వాపోయారు.

ప్రస్తుతం పాలేరు జలాశయం నీటిమట్టం 11 అడుగులుగా ఉందని, గతంలో తొమ్మిది అడుగులు నీళ్లున్నా పాత కాలువకు నీరు అందించి రైతన్నలను ఆదుకున్నారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా నీళ్ల విడుదల చేయకుండా పంటలను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రులు స్పందించి పాత కాలువ పరిధిలోని పంటలకు నీటిని విడుదల చేసి రక్షించాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయకట్టు రైతులు కలిసినప్పుడు తేదీల వారిగా చెప్పండి, నీళ్ల పంటలకు అందిస్తానని హామీ ఇచ్చారని, నేడు నీళ్ల లేవంటూ రైతన్నలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే నీళ్ల లేక ఎండిపోయిన వరి పొలాలకు ప్రభుత్వమే బాధ్యత వహించి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, జిల్లా నాయకులు యడవల్లి రమణారెడ్డి, శీలం గురుమూర్తి, మల్లెల సన్మతరావు, ముకుంద రెడ్డి, మండల నాయకులు మూడు గన్యా నాయక్, కర్ణ బాబు, పందిరి వీరారెడ్డి, మల్లేపల్లి సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి చీలంచర్ల రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసన కార్యక్రమాలు చేసింది. ధర్నాల్లో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వ వైఖరికి నిరసనగా హైదరాబాద్ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాగంటి గోపీనాథ్ నిరసన తెలిపారు. పోలీస్ అధికారులు జిహెచ్ఎంసి లోపలికి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో ప్రధాన గేటు ముందే ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికలకు ముందు హామీనిచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్‌ను అమల్లోకి తీసుకొస్తే ఉచితంగా చేయాలని కాంగ్రెస్ కోర్టుకు వెళ్లిందని గుర్తు చేశారు. ఇప్పటి నుంచి ప్రజల పక్షాన బిఆర్ఎస్ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు కార్పొరేటర్లతోపాటు బిఆర్ఎస్ యువనాయకులు జై సింహా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 15,205 మంది గైర్హాజరు

- బోర్డు కార్యదర్శి శృతి ఓజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్-1బి, జువాలజీ, హిస్టరీ పేపర్-1 పరీక్షను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4,26,197 మంది దరఖాస్తు చేయగా, 4,10,992 (96.5 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 15,205 (3.5 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పెద్దపల్లిలో నలుగురు, కరీంనగర్‌లో ఒకరు, జగిత్యాలో ముగ్గురు కలిపి మొత్తం పది మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం మ్యాథమెటిక్స్-1బి, జువాలజీ, హిస్టరీ పేపర్-1 పరీక్షకు సెట్ బీ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. మంచిర్యాల, నారాయణపేట, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని తెలిపారు.

నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు

- రోడ్ల మరమ్మతులకు రూ.30 కోట్ల చొప్పున ఇస్తాం
- మల్లన్నసాగర్ నుంచి తాగునీరు : మంత్రి కోమటిరెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 11వ తేదీన భద్రాచలంలో ముఖ్య మంత్రి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తారు.. ప్రథమ దశలో అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున.. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు అందజేస్తామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూవివేరా హోటల్‌లో మీడియాతో మంత్రి మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సాగునీరు, తాగునీరు ప్రాజెక్టులపై చర్చించామని, జిల్లాలో అదనంగా మరో రూ.200 కోట్లతో గంధమల్ల, బస్వాపూర్ పనులు పూర్తి చేసుకుని మల్లన్నసాగర్ నుంచి తాగునీరు అందిస్తామని తెలిపారు. మరికొన్ని రోడ్లనూ మంజూరు చేసుకునే కార్యాచరణలో ఉన్నామని, రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఒకటో తారీకునే వేతనాలు అందించి మళ్లీ పాత రోజులు తీసుకొచ్చామన్నారు. మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. శాసనసభ్యులు, మంత్రులు ఒక టీముగా ఏర్పడి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో ఐదు అమలు చేస్తున్నామన్నారు. మెగా డిఎస్‌సి ప్రకటించామని, వచ్చే నెలలో ఎగ్జామ్ ఉంటుందని తెలిపారు. బస్వాపూర్ ఆర్అండ్ఆర్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రధానమంత్రిని కలిసి త్రిబుల్ ఆర్ రోడ్డుకు సంబంధించి నిధులు అడిగామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఎవరికి నష్టం కలగకుండా మార్పులు చేర్పులు చేసుకుంటూ పనులు ప్రారంభిస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ సూపర్ గేమ్ ఛేంజర్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోడ్లకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.30 కోట్ల చొప్పున ఇస్తామన్నారు. రాష్ట్రంలో రోడ్ల పనులకు రూ.1150 కోట్లతో టెండర్లను పిలిచామని, రాయగిరి బ్రిడ్జి రోడ్డు పనులనూ వేగంగా నడుస్తున్నాయని తెలిపారు. అర్హులైన వాళ్లందరికీ త్వరలో రేషన్ కార్డు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మోత్కూరు మున్సిపల్ చైర్మన్‌కు అభినందనలు

ఇటీవల ఎన్నికైన మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి, ఇతర కౌన్సిలర్లను మంత్రి కోమటిరెడ్డి అభినందించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజాశ్రేయస్సు కోసం వినియోగించాలని చైర్మన్‌కు సూచించారు. రానున్నది ఎన్నికల సమయమని ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి కాంగ్రెస్ పార్టీని వారికి చేరువ చేయాలన్నారు.

లావా నుంచి బ్లేజ్ కర్వ్ 5జి

హైదరాబాద్ : స్మార్ట్‌ఫోన్ల తయారీదారు లావా ఇంటర్నేషనల్ భారత మార్కెట్లోకి కొత్త లావా బ్లేజ్ కర్వ్ 5జిని విడుదల చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ ఫోన్ 6.67-అంగుళాల 3డీ కర్వ్‌డ్ డిస్‌ప్లే, 64 మెగా పిక్సెల్స్ సెన్సర్‌తోపాటు ట్రిపుల్ రేర్ కెమెరా యూనిట్ కలిగి ఉంది. డోల్బీ ఆట్మోస్ పవర్డ్ స్టీరియో స్పీకర్లు, 33 వాట్ల చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఎహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ తదితర ఫీచర్లున్నాయి. 8జిబి ర్యామ్ విత్ 128 జిబి స్టోరేజీ వేరియంట్ రూ.17,999, 8 జిబి ర్యామ్ విత్ 256 జిబి స్టోరేజీ వేరియంట్ రూ.18,999లకు లభిస్తాయి. మార్చి 11 నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేనుంది.

ఉడాన్ ద్వారా 225 కోట్ల ఉత్పత్తుల రవాణా

హైదరాబాద్ : దేశంలో అతిపెద్ద ఇ-బిజినెస్-టు-బిజినెస్ (ఇబి2బి) ప్లాట్‌ఫారమ్ అయిన ఉడాన్ 2023లో తమ ప్లాట్‌ఫారమ్ ద్వారా 2.3 కోట్ల పైగా ఆర్డర్‌ల ద్వారా 225 కోట్ల పైగా ఉత్పత్తులను రవాణా చేసినట్లు తెలిపింది. ఈ ఆర్డర్‌లు దేశంలోని అన్ని రాష్ట్రాలకూ రవాణా చేశారని మంగళవారం తెలిపింది. దాదాపు పది లక్షల టన్నుల ఉత్పత్తులు రవాణా అయ్యాయని పేర్కొంది. గతేడాది 900 మంది ఒక్కొక్కరు రూ.1 కోటి విలువైన అమ్మకాలను సాధించగా, దాదాపు 600 మంది విక్రేతలు రూ. 2 కోట్ల విలువైన వ్యాపారం చేశారని తెలిపింది.

జిఎన్ఐటిఎస్‌లో ఉమెన్స్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్

ప్రజాశక్తి - హైదరాబాద్

మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జిఎన్ఐటిఎస్)లో 6-7 తేదిల్లో వుమెన్స్ లీడర్షిప్ కాన్‌క్లేవ్ సెకండ్ ఎడిషన్ (డబ్ల్యుఎల్‌సి24)ను ఏర్పాటు చేశారు. తొలి రోజు సమావేశానికి జిఎన్ఐటిఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రీవిద్యా రెడ్డి, సైయంట్ ఫౌండింగ్ చైర్మన్ బివిఆర్ మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఏడాది 'హెర్‌లెగసీ: ఎంపవరింగ్ ఉమెన్ లీడర్స్ ఫర్ సస్టెయినెబుల్ టుమరో' నినాదం సహా మరో ఐదు ఉప నినాదాలో ఏర్పాటు చేశారు. దీనికి వివిధ విభాగాలకు చెందిన 12,000 మంది ప్రతినిధులు, 30 పైగా కీలక ఉపన్యాసకులు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కాన్‌క్లేవ్ సందర్భంగా వివిధ ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థులు తమ టెక్నికల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు.

మెడికవర్‌లో శిశువుకు అరుదైన చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోనే తొలిసారి మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్‌లో అరుదైన పుట్టుకతో వచ్చిన వైకల్యంతో (శరీరం వెలుపల గుండెతో మరియు ఉదరభాగంతో) జన్మించిన 16 నెలల శిశువుకి విజయవంతంగా సర్జరీ చేసి పాప ప్రాణాలను కాపాడారు. టాంజానియాకు చెందిన 16 నెలల శిశువుకి అరుదైన పుట్టుకతోవచ్చిన వైకల్యంతో జన్మించిన శిశువుకు పీడియాట్రిక్ కార్డియాక్ సైన్సెస్ టీమ్, పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ టీమ్ విజయవంతంగా సర్జరీ చేసి పాప ప్రాణాలను కాపాడారు. "గుండె, ఛాతీ గోడ, ఉదర ప్రాంతాలను ప్రభావితం చేసే సంక్లిష్ట లోపాల పుట్టుకతో జన్మించిన పాపకు గుండె ఛాతీ కుహరం వెలుపల కొట్టుకోవడం, చర్మంతో మాత్రమే కప్పబడి ఉండటం, ఆమె ప్రేగులు, ఇతర ఉదర అవయవాలు బయటకు పొడుచుకు వచ్చి పలుచని పొరతో కప్పబడి ఉండటం కనుగొనబడింది. పెంటలజీ ఆఫ్ కాంట్రెల్ అని పిలువబడే ఈ పరిస్థితి డాక్టర్స్‌కు సవాలుతో కూడుకున్నది. 14 గంటల వ్యవధిలో జరిగిన ఈ సర్జరీ, పీడియాట్రిక్ కార్డియాలజీ మరియు పీడియాట్రిక్ సర్జరీలలో ప్రత్యేకత కలిగిన అత్యంత శిక్షణ పొందిన సర్జన్ల రెండు బృందాల మధ్య సహకార ప్రయత్నం. వారి సమన్వయ ప్రయత్నాలు, వివరాలకు ఖచ్చితమైన శ్రద్ధ ప్రక్రియ యొక్క సంక్లిష్టతలను నావిగేట్ చేయడంలో శిశువుకు సాధ్యమైనంత ఉత్తమమైన ఫలితాన్ని నిర్ధారించడంలో కీలక పాత్ర పోషించింది. " అని మెడికవర్ హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. ఈ చికిత్సలో డాక్టర్లు ఆశిష్ సప్రే, శ్రీనివాస్ కిని, మధు మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి పరిగే, పవన్ ప్రసాద్, మధు వినయ్, సంధ్య (పీడియాట్రిక్ అనస్థీసిస్ట్), నిర్మల్ రెడ్డి (పీడియాట్రిక్ అనస్థీసిస్ట్), నర్సింగ్ బృందం పాల్గొందని తెలిపింది. రోగికి ఫిబ్రవరి 22న 14 గంటల పాటు విజయవంతంగా ఆపరేషన్ చేయడం జరిగిందని.. మరో 10 రోజులలోపు డిశ్చార్జికి సిద్ధంగా ఉందని పేర్కొంది. ఇలాంటి పిల్లలు 55 లక్షల మందిలో ఒక్కరే పుడతారని తెలిపింది.

కళా వారసత్వ సంపదను ముందు తరాలకు అందించాలి

- జస్టిస్ రామలింగేశ్వరరావు

ప్రజాశక్తి కల్చరల్

తెలుగు వారికే సొంతమైన హరి కథ ఆంధ్ర నాట్యం వంటి కళా వారసత్వాన్ని ముందు తరాలకు అందించ వలసి వుందని ఇందుకు ఆ కళల పరిరక్షణ అవసరం అని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వర రావు అన్నారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళా వాహిని నిర్వహణలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించిన హరి కథా కళాకారిణి ఉమా మహేశ్వరి కి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన కళా కృష్ణ లను అక్కినేని లలిత కళా పురస్కార ప్రదానం జరిగింది.ముఖ్య అతిథిగా జస్టిస్ రామ లింగేశ్వర రావు పాల్గొని ఇరువురికి పురస్కారం బహూకరించి మాట్లాడారు.హరికథ సకల కళల సమాహారం తెలుగు సంప్రదాయ కళను కేంద్రం గుర్తించి పద్మ అవార్డు ప్రకటించటం ఆనంద కరమ్ అన్నారు. తమిళ నాట కళా కారులకు గొప్ప గౌరవం వుంటుందని వారి సంప్రదాయం తెలుగు వారు పాటించాలని కోరారు. కళా కృష్ణ ఆంధ్ర నాట్యం లో ఎందరికో శిక్షణ ఇస్తున్నారని అభినందించారు. సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ కళా కృష్ణ గురువు నటరాజ రామకృష్ణ ఆశయానికి అనుగుణంగా ఆంధ్ర నాట్యం ను ప్రచారం లో ఉంచుతున్నారు అని అభినందించారు. భార్య ఉమా మహేశ్వరికి ఆయనకు వో కే సారి ప్రభుత్వాల గుర్తింపు దక్కటం విశేష మన్నరు. కళా పోషకుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కళా రంగం కు వన్నె తెచ్చిన వారు ఉమా మహేశ్వరి కళా కృష్ణ అని పేర్కొన్నారు వేదిక పై రచయిత్రి డాక్టర్ కృష్ణ కుమారి, హిపో్న పద్మా కమలాకర్ సినీ జర్నలిస్ట్ ఎస్.వీ. రామా రావు తదితరులు పాల్గొనగా సంస్థ అధ్యక్షులు లంక లక్ష్మి నారాయణ స్వాగతం పలికారు. కార్యక్రమానికి తొలుత ఉమా మహేశ్వరి కుప్తం గా రుక్మిణీ కళ్యాణం హరి కథ గానం చేశారు

చట్ట సభల్లో మహిళా ప్రాధాన్యత పెరగాలి

ప్రజాశక్తి కల్చరల్

చట్ట సభలలో మహిళా ప్రాధాన్యత పెరగాలి అని రాష్ట్ర శాసన సభ తొలి సభా పతి సిరికొండ మధు సూదనాచారి అన్నారు శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భిన్న రంగాలకు చెందిన ప్రముఖ మహిళలు కె.లలిత,ఎస్.శ్రీమణి, టీ. శోభా రాణి ల సత్కార సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా మధుసూదనాచారి పాల్గొని సత్కార అనంతం మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభ కనపరుస్తున్నరని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాన సభ పాలక మండలి సభ్యులు భమిడి ఉష పాల్గొన్నారు

మహిళలకు సమానత్వం కల్పించాలి

- వివక్ష, వేధింపులకు వ్యతిరేకంగా పోరాటం : మల్లు లక్ష్మి,

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సదస్సులో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో సమానత్వం కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ముషీరాబాద్ మహిళా కన్వీనర్ రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణ జ్యోతి, నాయకులు పద్మశ్రీ అధ్యక్షత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. స్వేచ్ఛ.. సమానత్వం.. స్త్రీ విముక్తి కోసం జరిగే పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రోజూ ఎనిమిది గంటల పని దినం కావాలని, పని ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు కోసం పోరాడి హక్కులను సాధించుకున్న శ్రామిక మహిళల త్యాగాలు వెలకట్టలేనివని చెప్పారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలన్నారు. మహిళల పట్ల వివక్ష, అసమానత, లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని, వాటిపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు అరిబండి ప్రసాద్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు వందన, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ప్రసాద్, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ రాష్ట్ర కన్వీనర్ మమత, డివైఎఫ్ గర్ల్స్ రాష్ట్ర కన్వీనర్ శృతి, ఐద్వా ఉపాధ్యక్షులు నాగలక్ష్మి, శశికళ, వినోద రాష్ట్ర కమిటీ నాయకులు సృజన, పద్మ, షబానా తదితరులు పాల్గొన్నారు.

కోవలెంట్ పరిశ్రమలో ఘోర ప్రమాదం

- రియాక్టర్ వద్ద మంటలు అంటుకొని కార్మికుడు దుర్మరణం
- పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని మృతుని కుటుంబ సభ్యుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచనూర్ గ్రామ శివారులోని కోవలేంట్ పరిశ్రమలో రియాక్టర్ వద్ద మంటలు చెలరేగి ఒక కార్మికుడు దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోవలెంట్ పరిశ్రమలోని టిబి బ్లాక్-4లో హత్నూరకు చెందిన వినోద్ కుమార్ (30) కెమిస్ట్‌గా, జార్ఖండ్‌కు చెందిన ఫాదర్ మారండి, లాల్ బాబ్ తూరి, స్వాధీన్ రాజు కార్మికులుగా పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం కెమికల్ పౌడర్ అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో రియాక్టర్ వద్ద అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాంతో అక్కడే పని చేస్తున్న వారిని మంటలు చుట్టుముట్టాయి. సేఫ్టీ లేకపోవడంతో మంటలు అంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. ఎగసిపడిన మంటలకు భయపడి కార్మికులు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కానీ రియాక్టర్ వద్ద పనిచేస్తున్న నలుగురు కార్మికులు కెమిస్ట్‌తో కలిసి మంటల్లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డారు. పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వినోద్‌కుమార్ మృతి చెందారు. కాగా మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగితే.. రాత్రి సమయంలో వినోద్ కుమార్ కుటుంబీకులకు యాజమాన్యం చెప్పింది. దాంతో ఆగ్రహించిన వారు బుధవారం ఉదయం కోలెంట్ పరిశ్రమ గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించకపోవడంతో సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై పరిశ్రమ ఎదుట బైఠాయించి.. ప్రమాదానికి కారకులైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సికింద్రాబాద్‌పై ప్రధాన పార్టీల ఫోకస్

- ఆరు గ్యారంటీల అమలే ప్రచార అస్త్రంగా కాంగ్రెస్
- నియోజకవర్గాల సమావేశాలతో బిఆర్ఎస్ బిజీబిజీ
- విజయ సంకల్ప యాత్రలో బిజెపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఎలాగైనా ఈ స్థానాన్ని తమ ఖాతాల్లో వేసుకునేందుకు అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. వివిధ కార్యక్రమాలతో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నియోజకవర్గంలో పాగా వేసేందుకు పోటాపోటీగా పని చేస్తున్నాయి.

చేరికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి..

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించాలని కోరుతూ పార్టీ ముఖ్య నాయకులు ఏ కార్యక్రమం జరిగినా వివరిస్తూ ముందుకెళ్తున్నారు. ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానంగా చేరికలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఇటీవల మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు, డిప్యూటీ మేయర్ దంపతులు, ఇతర కార్పొరేటర్లు, ముఖ్యనేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామం కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య మాటల యుద్ధంగా మారింది. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు తమ నేతలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని బిఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాము చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసే పార్టీలోకి చేరుతున్నారని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బొంతు రామ్మోహన్ బరిలో దిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అదే విధంగా ఈ టికెట్‌పై ప్రముఖ విద్యావేత్త డాక్టర్ విద్యాసవంత్రి కూడా ఆశలు పెట్టుకున్నారు. వీరితోపాటు మరో డజను మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవరివైపు మొగ్గుచూపుతుందో వెచిచూడాల్సిందే.

బిఆర్ఎస్ అభ్యర్థిపై స్పష్టత కరువు..!

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో సీట్లు గెలిచినా.. గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం చతికిలపడింది. గ్రేటర్‌లోని నాలుగు పార్లమెంట్ స్థానాల పరిధిలో 28 స్థానాలుండగా.. వీటిలో కాంగ్రెస్ కేవలం మూడు స్థానాలనే గెలిచింది. బిఆర్ఎస్ 17, ఎంఐఎం ఏడు, బిజెపి ఒక స్థానాన్ని గెలుపొందాయి. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో అందరూ బిఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు కావడం.. రెండుసార్లు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించడం ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో కలిసొచ్చే అంశమే. కానీ బిఆర్ఎస్ తరపున బలమైన అభ్యర్థి లేరు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ బరిలో నిలిచి ఓటమిచెందారు. ప్రస్తుతం బిఆర్ఎస్ తరపున పోటీలో దిగేందుకు ఎవరూ ఆసక్తి చూపెట్టకపోవడంతో.. సాయికిరణ్‌కే మరోసారి టికెట్ దక్కనుందని సమాచారం.

సిట్టింగ్‌కే ఛాన్స్..

అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో ఒక స్థానానికే పరిమితమైన బిజెపి.. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు భిన్నంగా పార్లమెంట్ ఫలితాలు ఉంటాయనే ధీమాతో ఉన్న కమలం పార్టీ.. ఇప్పటికే రాష్ట్రంలోని 17 స్థానాలకు తొమ్మిది మంది అభ్యర్థులను ప్రకటించింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి మరోసారి కిషన్‌రెడ్డి బరిలో నిలవనున్నారు. ఈ స్థానంలో మరోసారి కాషాయ జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ ఉవ్విళ్లూరుతోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయడంతో పాటు డివిజన్‌లు, వార్డులు, బస్తీల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తోంది. దీనికితోడు విజయసంకల్ప యాత్ర చేపట్టి సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనాలకు వివరించడంతో పాటు కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలంటూ ప్రజల ఆదరాభిమానాలు పొందేందుకు యత్నిస్తోంది. అయితే సికింద్రాబాద్ ఎంపిగా గెలిచిన కిషన్‌రెడ్డి.. గడిచిన ఐదేళ్లలో నియోజవర్గాన్ని పెద్దగా పట్టించుకోకపోగా.. ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.